

కొత్త రోజులు

వేదుల శకుంతల

సాయంత్రం ఐదుగంటలు అయింది. మంగమ్మ గారు వీధి వాకిట్లో కూర్చుంది. ఆవిడ ఒడిలో ఏణ్ణర్థం పాప మగతగా పడుకుని వుంది. వీధిలో కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. అందులో ఐదేళ్ళ 'సుజన' కూడా వుంది!

మంగమ్మగారు తెగ చికాకు పడుతున్నారు. మాటిమాటికి ఒళ్ళో వున్న పాపని విసురుగా లాగి పడుకోబెట్టుకుంటున్నారు. క్షణానికోసారి వీధి చివరకి దృష్టి మరల్చి 'ఇంకా రావటం లేదు' అన్నట్టుగా ముఖం ముడుస్తూ-గొణుక్కుంటున్నారు.

ఆవిడ మనసిక్కడ లేదు! గంట క్రితమే, ఇరుగుపొరుగు స్నేహితులంతా కలిసి, ఆ రోజు కమ్యూనిటీ హాలులో ఉపన్యసించబోతున్న — బాబాగారి సన్నిధికి వెళ్ళారు. తను వెళ్ళలేక పోయింది!

'ఈపాటికి హాలంతా కిటకిటలాడిపోతూ వుంటుంది. వారి గంభీర ఉపన్యాసం ప్రారంభమయే వుంటుంది!! పక్కింటి కామేశ్వరమ్మ - చివరింటి అన్నపూర్ణ - నాల్గో ఇంటి వరాలూ, ఎంత బాగా వింటున్నారో! ప్చ్! దేనికైనా అదృష్టం వుండాలి. మొన్నటికి మొన్న అంతే - "వదినగారూ, శివాలయంలో పురాణం చెప్తున్నారు - మేము వెళ్తున్నాం మీరు వస్తారా?" అని అడిగింది శేషమ్మ. 'అయ్యో నాకంత భాగ్యమా తల్లీ? మీరు వెళ్ళి రండి!' అని పంపేసింది.

'ఖర్మ! ఖర్మ! కాక? ఈ వయస్సులో కృష్ణా రామా అంటూ కాలక్షేపం చేసుకోవలసింది పోయి....ఇల్లు పట్టుకుని కూర్చోవలసివస్తోంది. ఆ 'మహారాణీ' పది గంటలకల్లా....అబ్బాయితో పాటు వెళ్ళిపోతుంది. ఈ పసిదాన్ని పెట్టుకుని తను ఇంట్లో పడివుండాలి! స్కూలు నుంచి వచ్చే పిల్లలకి అన్నాలు పెట్టి వాళ్ళ అవసరాలన్నీ చూస్తూ ఇంటి కాపలా కాయాలి! ఏనాడో తను పిల్లల్ని పెంచింది! ఇప్పుడు ఇంత వయస్సు వచ్చాక మళ్ళీ చిన్నపిల్లల ఆలనా పాలనా చూడాలంటే ఎంత చికాకు? ఎప్పుడూ కూపస్థ మండూకం లాగా ఈ నాలుగోడల మధ్య బ్రతకాల్సిందే తప్ప బయటి కెళ్ళే యోగ్యత వుందా? ఏమిటో పెద్ద వయస్సులో అన్నీ బాధలే! ఓ పుణ్యమా? పురుషార్థమా!

కన్న తల్లి ఆ తీరున పోతే, ముసలి పీనుగని నేనా పిల్లల్ని చూసుకోడం? ముక్కు తుడిచి, మూతి కడిగి నిద్రపుచ్చి, నానా అవస్థపడాలి. ఏమిటీ నాకీ ఇరకాటం? లాభం లేదు. ఇక అబ్బాయితో చెప్పాల్సిందే! నా జీవితం ఇలాగే వెళ్ళమారిపోతే ఏమిటీ బ్రతుక్కి అర్థం? జన్మంతా చాకిరీలతోటే, సరిపోయేట్టుంది!' ఆలోచనల్లోనుంచి బయట పడ్డారు మంగమ్మగారు.

"అమ్మో! అయ్యో! బామ్మగారూ, సుజన పడిపోయింది, మోకాలు గీరుకుపోయి రక్తం వస్తోంది!" పిల్లలంతా గోలగోలగా అరుస్తున్నారు.

"అమ్మయ్యో! ఆ డ్రైనేజి మూత మీద పడిందండీ? ఆ మూత గీసుకుపోయింది."

"బాబోయ్ తలకే గనుక తగిలితేనా ఇంకేం లేదు!" అందరిలోకి పెద్దగా వున్న పిల్ల గుండెల మీద చేయి వేసుకుని కళ్ళింతింతచేసి భయపెట్టింది.

ఒడిలో వున్న పాపని ఒక్క ఊపున బుజాన్న వేసుకుని, మెట్లుదిగి సుజన దగ్గరకి వచ్చారు మంగమ్మగారు.

పిల్లలంతా కలిపి లేవనెత్తిన సుజన, తగిలిన దెబ్బ బాధకన్నా కారుతున్న రక్తాన్ని చూసుకుని 'బోర్'మని ఏడుపుస్థాయి పెంచింది! పిల్లల అరుపులు విని ఎదురింటి ఇల్లాలు బయటికి వచ్చింది!

"రామ! రామ! ఈ పిల్లలతో చచ్చిపోతున్నాను. ఈ చంటిదానికి జ్వరం! ఇప్పుడేమో ఇది పడి దెబ్బతగిలించుకుంది. వాళ్ళమ్మ ఇంకా రాలేదు. నాకెక్కడిసంతమ్మా ఇదంతా?"

సుజనని రెక్కపట్టుకుని గుంజుతూ ఎదురింటావిడతో, చెప్పుకుపోతున్నారు మంగమ్మగారు-"ఇదిగో జానకమ్మా రోజూ ఈ గొడవలతో పడలేకపోతున్నాననుకో! నాకే అసలు ఓపికలేదు. వీళ్ళనెక్కడ కనిపెట్టుకుని చూడగలనూ? చెట్టు చచ్చేకాలానికి కుక్కమూతి పిందెలాగా ఈ పెద్ద వయస్సులో ఓ సత్కాలక్షేపం లేకుండా ఈ పితలాటకం ఏమిటి చెప్పు! ఛ! ఇంకా నా బ్రతుకు అడక్కు తల్లీ! రాక్షసి పిల్లలతో పడలేను."

"అయ్యో బామ్మగారూ....రక్తం అంతా కారిపోతోంది. బాబోయ్ సుజనకి ఇంక రక్తం వుండదేమో!" ఓ పిల్ల గోల పెట్టింది. జానకమ్మ గబగబా వాళ్ళదగ్గరికి వచ్చి "ముందు దాని సంగతి చూడండి మంగమ్మగారూ....ఆ చంటిదాన్ని ఇలా ఇవ్వండి" అంటూ ఆవిడ చంకలో పాపని అందుకుంది.

ఎవరో వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చారు.

సుజన నెత్తిన మొట్టి-కాలు సరిగా లాగి చెంబుడు నీళ్ళతో ఆ దెబ్బని కడగటమనే పని పూర్తిచేస్తూ "వీళ్ళ ఆటలు తగలెయ్య! ఓ చోట నెమ్మదిగా కూర్చుని ఆడుకోరాదూ? ఈ దూకటాలు, పరిగెత్తటాలు ఎందుకు? వీళ్ళమ్మా నాన్నా వచ్చేక నాకు నిష్టూరాలు తప్ప, పొద్దస్తమానం చూస్తున్నదేమన్నా కనిపిస్తుందా?" అంటూ విసుక్కున్నారు ఆవిడ.

సుజన ఏడుపు ఆగటంలేదు. జానకమ్మ చేతిలో చంటి పాప నిలవటం లేదు. బామ్మ దగ్గరకి పోతానని జారిపోతోంది! సుజనని ఓ చేత్తో, చంటిదాన్ని మరో చేత్తో అందుకుంటూ "ఇంకా ఆ అంట్ల వెధవ ఎక్కడున్నాడో? వాడు, ఎప్పుడు పెంటకుప్పలు, మట్టి దిబ్బల మీదే ఏడుస్తాడు" అంటూ ఎనిమిదేళ్ళ గోపిని కూడా తలుచుకుంటూ వీధి గుమ్మం ఎక్కేరు మంగమ్మగారు.

సుజన కాలునుంచి ఇంకా రక్తం కారుతూనే వుంది. చంకలో పిల్ల జ్వర భారంతో మూల్గుతోంది. మధ్య మధ్య అక్క ఏడుపు వింటోంది. ఆ సమయంలోనే పక్క వీధిలో బంతి ఆడుకుంటున్న గోపికి ఎవరో చెప్తే పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిటీ బామ్మా? చెల్లాయికి దెబ్బ తగిలిందా?" పిల్లలమధ్యనుంచి చోటు చేసుకుంటూ రొప్పుతూ అడుగుతున్న గోపిని చూసి, "వచ్చావా? ఎక్కడేద్చేవు ఇంతసేపూ? చెల్లాయిని ఆడించుకోవాలని తెలియదూ? చూడు ఎంత దెబ్బ తగిలిందో?"

"ఆ! పాపం! నేనేం చేసేనూ? నేను పడేసేనా? నువ్వు చూడకూడదూ?" తల ఎగరేస్తూ అడిగేడు.

"అన్నావూ? అంటావురా? నువ్వు అంటావని నాకు తెల్సు. వింటున్నావా జానకమ్మా? వేలెడంత లేడు ఎలా నిగ్గతీస్తున్నాడో చూసేవా?"

"అబ్బ ఊరుకోండి మంగమ్మగారూ చిన్న పిల్లాడు ఏదో అంటాడు. వాడి మాటలు లెక్కేమిటీ? ముందు దానికేదైనా మందు రాయండి" గోపీ రివ్వున దూసుకెళ్ళి అలమారలో మందు ట్యూబ్ అందుకొచ్చాడు గచ్చకాయంత ముద్ద తీసి దెబ్బ చుట్టూ పట్టించేడు. డ్రాయర్ లాగి అందులో ఉతికి మడతపెట్టి వుంచిన సుజన రిబ్బను తెచ్చి జానకమ్మ వారిస్తూన్నా ఆగకుండా చుట్టేసేడు.

మెల్లమెల్లగా ఒక్కొక్కరే వెళ్ళిపోయేరు.

సుజన ఏడుపు మానినా వెక్కిళ్లు తగ్గలేదు! కుర్చీలో కూర్చుని కాలువైపు చూసుకుంటూ, కళ్ళు ఒత్తుకుంది! బామ్మ కసరడం వల్ల గోపీ బయటికెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయేడు.

చంటిపిల్లని మెల్లగా పడుకోబెట్టి జోగొడ్తున్నారు, మంగమ్మగారు. సంధ్య చీకట్లు పరుచుకుంటున్నాయి!

పావు తక్కువ ఆరు అవుతున్నప్పుడు ముందుగా, మధుమూర్తి వచ్చాడు ఆఫీసునుంచి.

సుజన మళ్ళీ ఏడుపు అందుకుంది!

మంగమ్మగారు విషయం వివరించబోతూ వుండగా గోపీ కూడా కలగచేసుకున్నాడు. ఒకరి మాట ఒకరికి పొత్తకుండా చెప్తున్నారు.

మధుమూర్తి ఓసారి సుజనని దగ్గరికి తీసుకుని ఓదార్చి తర్వాత చంటిదాని జ్వరం సంగతి అడిగి డ్రస్సు విప్పుకుంటున్నప్పుడు మంగమ్మగారు మొదలెట్టేరు.

"ఒరే మధూ! వచ్చేవారంలో నేను విజయవాడ వెళ్తానురా! నన్ను పంపించు!"

"ఇప్పుడు ఆ సంగతెందుకమ్మా?" చిన్నగా నవ్వేడు.

"ఒరే! నువ్వు ఇలా ప్రతిసారీ నా మాట తేలిగ్గా తీసేయకురా! అమ్మాయిని చూడాలని ఎన్నాళ్ళనుంచో మనసు పీకుతోంది! ఎప్పటికప్పుడే వాయిదా వేస్తున్నావు! ఈ సారి మాత్రం తప్పదు. రేపే దానికో ఉత్తరం ముక్క రాసిపారేస్తాను. నువ్వు పంపిస్తావా సరేసరి లేకుంటే దాన్నే వచ్చి తీసుకెళ్ళమని రాస్తాను" అంత నిక్కచ్చిగా చెప్తున్న తల్లివైపు వింతగా ఒకింత కలతగా చూసేడు మధుమూర్తి.

పుట్టి బుద్దెరిగినప్పట్నుంచీ, తల్లి పట్టుదల, పంతం తెల్సున్నా తండ్రి పోయినప్పట్నుంచీ అతి జాగ్రత్తగా చూసుకుంటూ కావల్సిన సదుపాయాలన్నీ చూస్తూ కాలక్షేపం చేసుకువస్తున్నాడు. అయినా, అప్పుడప్పుడు ఈ రకమైన బెదిరింపులు, పంతాలు తప్పటం లేదు. సమయ సందర్భాలు గుర్తించకుండా, బొత్తిగా పిల్లలు పేచీలు పెట్టినట్టు వుండే తల్లి ధోరణికి అతి కష్టంమీద నిగ్రహించు

కుంటూ వుంటాడు మధు! "సరేలేమ్మా! పై వారంలో అంటున్నావు గదా? చూస్తాలే!" షర్టు స్టాండ్ మీద పడేసి బాతురూమ్ వైపు వెళ్తుంటే గుమ్మంలో అడుగుపెట్టింది, సుధ!

ఒడిలిపోయిన తోటకూర కాడలా నీర్సంగా, నిస్త్రాణగా వుంది సుధ! ఓ క్షణం జాలిగా చూసి, గబగబా బాత్‌రూమ్‌కి వెళ్ళిపోయాడు మధు.

అమ్మని చూడగానే సుజన మళ్ళీ మొదలెట్టింది ఏడుపు! ఈ సారి మంగమ్మగారు ఏం కల్పించుకో లేదు! గోపీయే గడగడా జరిగిందంతా చెప్పేసేడు.

అసలే అలసటగా వుంది. చిన్నదాని జ్వరం ఎలా వుందో అనుకుంటూ వచ్చింది. ఇప్పుడు సుజన దెబ్బ కూడా తగిలించుకుంది! లేని ఓపిక తెచ్చుకుని సుజనని దగ్గరికి తీసుకుని "ఫర్వా లేదమ్మా" తగ్గిపోతుందని బుజ్జగించింది. తర్వాత చంటిదాని ఒంటిమీద చేయివేసి చూసి "ఏమైనా ఏడ్చిందా అత్తయ్యగారూ?" అని అడిగింది. మంగమ్మగారు ముఖం పక్కకి తిప్పుకుని "ఎందుకమ్మా ఆ అడగటం? ఏడ్పించినా, నవ్వించినా తప్పదుకదా? నువ్వేమో ఉద్యోగస్తురాలివాయే! పిల్లల్ని చూసుకుందుకు నీకెలా తీరుతుందీ?" అనేసి పక్కగదిలోకి వెళ్ళిపోయేరు.

ఆమె నుంచి అంతకన్నా మృదువుగా సమాధానం ఆశించని సుధ – పేలవంగా నవ్వుకుని మెల్లగా పనిలోకి ప్రవేశించింది.

యాంత్రికంగా వంట ముగించి, అందరికీ పెట్టి, చంటిపిల్లకి మందుపోసి పడుకోబెట్టి - రాత్రి పది గంటలవుతుండగా పక్క మీద మేను వాల్చింది సుధ!

తను ఉద్యోగస్తురాలు! నిజమే. కానీ ఏమిటి సుఖం? ఇంటి పని తప్పిందా? ఇంటా బయటా చేస్తుంటే....ఎప్పుడో రావల్సిన వృద్ధాప్యం— ముందే వచ్చేస్తున్నట్టుంది! అలసిపోతున్న శరీరం కనీసపు సరదాలకీ, కోరికలకీ దూరమవుతోంది! ఈ వయస్సులో వికసించవలసిన మనసు ముకుళించుకు పోతోంది! పోనీ బాంక్ బాలెన్స్ ఏమైనా వుందా అంటే....పిచ్చి! వేడినీళ్ళకి చల్లనీళ్ళు తోడనే గదా తను ఈ జాబులో చేరిందీ? ఆర్థిక స్థితిగతులు చక్కబడేవరకు బ్యాంక్‌లో డిపాజిట్ తప్ప – (అది తప్పదు గనుక) వుండదు. కడుపు నిండా అన్నం తినడానికి కూడా టైముండదు ఒక్కోసారి! ఆదరా బాదరా నాల్గు మెతుకులు



పూసలతో హంసతూలికాతల్పం

శ్రీమతి వి. శేషకుమారి లేసులతోనూ, ఊలు దారాలతోనూ అనేక కుట్లు, అల్లికలు చేశారు. పూసలతో దాదాపు ముప్పైరకాల అలంకరణ వస్తువులు తయారు చేశారు. ఇక్కడ పూసలతో హంసతూలికాతల్పం ఎలా చెయ్యవచ్చునో తెలియజేస్తున్నారు.

కావలసిన వస్తువులు : ఆరంజిరంగు పూసలు-50 గ్రాములు; తెలుపురంగు పూసలు–50 గ్రా॥; ఎరుపురంగు పూసలు-5 గ్రా॥; ప్లాస్టిక్ వైరు (పూసలు గుచ్చడానికి). పైన ఉదహరించిన రంగు పూసలతోనే చెయ్యాలని లేదు. ఎవరికి నచ్చిన రంగు పూసలు వారు ఉపయోగించ వచ్చును.

1. మొదట నాలుగు హంసలు తయారు చేసుకోవడానికి గాను ఎనిమిది హంసల బేస్‌లు చిత్రంలో చూపినట్లుగా అల్లుకోవాలి.

మొదటి బేస్‌లో ఆరంజిరంగు పూసలతో 5 పూసల చొప్పున 1 వరుస, 6 పూసల చొప్పున 2 వ వరుస, 7 పూసల చొప్పున 3 వ వరుస, 8 పూసల చొప్పున 4 వ వరుస, 9 పూసల చొప్పున 5 వ వరుస అల్లి ఆ పైన దిశమార్చి అర్ధంగా చిత్రంలో చూపిన విధంగా అల్లుకుంటూ రావాలి. ఇలా అల్లేటప్పుడు హంస ఆకారాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ ఆ ఆకారానికి తగ్గట్టుగా అడ్డు అల్లిక పూసలని తగ్గించుకుంటూ, పెంచుకుంటూ అల్లుకురావాలి. ఇలా 8 హంస ఆకారపు చాపలని అల్లుకుని, ఒక్కొక్క హంసకు 2 చాపల చొప్పున వేర్వేరుగా వుంచి, ఆ రెండింటి మధ్య దూది, అట్ట, సిగరెట్ పెట్టిల్లో వుండే 'సిల్వర్' కాగితాన్ని దూర్చి, ఆ రెండు చాపలని అటూ, ఇటూ పెట్టి వాటిని అతికితే ఒక హంస తయారవుతుంది. ఇలాగే 4 హంసలు తయారు చేసి వుంచుకోవాలి. ఇక ఇప్పుడు ఈ నాలుగు హంసల లోనూ రెండు హంసల మూతులను తెలుపురంగు పూసలతో కలపాలి. ఇప్పుడు రెండు హంసల జతలు తయారవుతాయి. వీటిని విడిగా ఒక ప్రక్కన పెట్టుకోవాలి.

2. ఇప్పుడు 1 సెంటిమీటరు పొడవుతోనూ 6 సెంటిమీటర్ల వెడల్పుతోనూ చిత్రంలో చూపిన విధంగా దీర్ఘచతురస్రపు బేస్ అల్లుకోవాలి. ఆ బేస్‌ని హంస కాళ్ల ఆకారంలో అల్లిన అల్లికల పూసలతో కలిపితే హంస తూలికా తల్పానికి కావలసిన తలవైపు, కాళ్ళ వైపు ఆధారాలు ఏర్పడతాయి.

3. ఆ తరువాత 6 సెంటిమీటర్ల పొడవుతోనూ, 9 సెంటిమీటర్ల వెడల్పుతోనూ దీర్ఘచతురస్రపు చాపలు రెండు అల్లుకోవాలి. ఆరంజిరంగు పూసలతో వరుసకి 17 చొప్పున 24 వరుసలు అల్లుకుంటూ రావాలి. అలా అల్లేటప్పుడు మనకి కావలసిన డిజైను అందంగా తెలుపురంగు పూసలతో అల్లుకోవాలి. అలాంటి చాపలు రెండు అల్లిన తర్వాత వాటి రెండింటి మధ్య దూది, అట్ట, సిల్వర్‌పేపర్ పెట్టి ఆ రెండు చాపలను కలిపి అల్లికచేస్తే మంచం ఉపరితలం తయారవుతుంది.

4. ముందుగా తయారు చేసి వుంచుకున్న హంసల బేస్‌లు, హంసలని మంచం బేస్‌కి తల వైపున జాయింట్ చెయ్యాలి. అదే విధంగా మరో హంసల బేస్‌ని కాళ్ళవైపు జాయింట్ చేస్తే హంసతూలికాతల్పం తయారవుతుంది. ఎరుపు రంగు పూసలతో మంచం బార్డర్ చుట్టూరా అల్లుకుంటే అందంగా వుంటుంది. □

కొరికి, ఆఫీసుకి పరిగెట్టుంది! మళ్ళీ ఇల్లు చేరుకునే సరికి జీవచ్ఛవంలా తయారవుతుంది!

ఈ ఉద్యోగంవల్ల తను అనుభవిస్తున్న ఆనందం ఏమిటీ? కన్న పిల్లల్ని సరిగా చూసుకోలేక పోతోంది! మధ్యాహ్నం పూట కాస్సేపు నిద్ర పోడం అనేది తల్చుకోడానికే వీలవదు! సాయంత్రం పూట కులాసాగా కూర్చుని కబుర్లు చెప్పుకునే అదృష్టం లేనేలేదు! ఈ మధ్య కాలంలో సినిమా చూసిన గుర్తులేదు!

ఇదేనా తన సుఖం? నిజానికి ఈ ఉద్యోగం వదిలేస్తే తను ఎంతో హాయిగా వుండొచ్చును! అత్తగారి సణుగుళ్లు, గొణుగుళ్లు — విసుర్లు పడక్కర్లేదు! కానీ - అప్పుడు భర్త ఎంత కష్ట పడాలో... తనకు తెలుసు! సంసారం ఎంత గడ్డుగా తయారవుతుందో ఊహించగలదు!! అందుకే తను ఉద్యోగం చేయడానికే నిశ్చయించుకుంది!— తల తిప్పి పక్క మంచంలో నిద్రపోతున్న భర్త వైపు అభిమానంగా చూసింది.

పగలంతా పడిన శ్రమని గుర్తు చేసుకుని, గతంలోపడిన అవస్థలతో బేరీజు వేసుకుని-ఏ వైపు బరువు ఎక్కువుందో తెలిసేక ఉద్యోగం చేయ డానికే, అత్తగారి నిరసనలు, మూతి విరుపులు భరించడానికే, సిద్ధపడుతున్నట్టు-దీర్ఘంగా నిట్టూర్చుకుని నిద్రపోతున్న భర్తని పిల్లల్నీ ఆప్యాయంగా చూసుకుని, పడుకోడం సుధ నిత్యకృత్యాల్లో-తప్పని సరై పోయింది!

సరిగ్గా ఆ సమయంలోనే - పక్క గదిలో మంగమ్మగారు, పక్కమీద పడుకోబోతూ, మరో సారి గట్టిగా అనుకున్నారు—'వృద్ధాప్యంలో నిశ్చింతగా బ్రతకాలి. నాకెందుకీ జంఝూటాలన్నీ! కోడలు ఊరు పట్టుకుని తిరిగితే, అత్త ఇంట్లో పిల్లల్ని కనిపెట్టుకుని వుండాలా? ఏం మాయదారి కాలం? భర్త బ్రతికి వున్న రోజుల్లో తనెంత దర్జాగా బ్రతికిందీ? ఎంత హాయిగా తిరిగేదీ? ఇల్లు ఎప్పుడూ ఎంత సందడిగా వుండేదీ? ఏమిటో ఈనాటికి తన స్థితి ఇలా దిగజారింది! జైలు జీవితంలా అయిపోయింది! తోటి వాళ్ళలా-ఓ గుడికీ, గోపురానికీ, పురాణానికి, పూజకీ వెళ్ళడానికేనా వీలు లేదు! ఛ! ఎందుకొచ్చిన అవస్థ? తేరగా వున్నా ననీ ముసలి ఏనుగుననీ-వీళ్ళు నన్నిలా బంధించేస్తున్నారు! ఇంక ఊర్కోను. ఎలాగైనా అమ్మాయి దగ్గరికి వెళ్ళిపోతాను. అప్పుడు ఏం చేస్తారో చూడాలి! కోడలుపిల్ల ఉద్యోగం చేస్తుందో మాను తుందో తెలుస్తుంది! అత్తంటే ఇంత అలుసా?'

*

మర్నాడు మధ్యాహ్నం - మంగమ్మగారు చంటి పిల్లనీ, సుజననీ, హాల్లో కూర్చోబెట్టుకుని, తీరుబడిగా అమ్మాయికి రాయబోయే ఉత్తరాన్ని గురించి ఆలోచిస్తున్నారు! తనిక్కడ ఎంత ఇబ్బంది పడుతున్నదీ వాళ్ళు తనని ఎంత చులకనగా, తేలికగా చూస్తున్నదీ అన్నీ వివరంగా రాయాలనుకుని — ఎక్కడ్నించి ఎలా మొదలు పెట్టాలా అని యోచిస్తున్నారు. సుజనకి నిన్నటి దెబ్బ వాచి కాలు నొప్పి చేసి స్కూలుకి వెళ్ళలేక ఇంట్లోనే వుండి పోయింది.

చంటిదానికి తోడు పెద్దపిల్లని కూడా చూసుకోవలసి వచ్చిందని, ఆవిడకి తెగ విసుగ్గా వుంది. అసలు ఆరోజు బాబాగారి ఉపన్యాస వివరాలన్నీ వరాలమ్మ దగ్గరికి వెళ్ళి తెల్సుకోవాలనుకున్నారు. చంటిపిల్లనైతే ఎలాగో చంకనేసుకుని వెళ్లచ్చును. కానీ సుజనని ఎలా తీసుకెళ్ళాలి? అందుకే ఆవిడ చాలా కోపంగా అసహనంగా వుంది. మనసంతా కుతకుతలాడిపోతోంది. తనకి ఇంట్లో బొత్తిగా గౌరవం లేకుండా పోతోందన్న భావం క్షణక్షణానికి పెరిగి పోతుంటే భరించుకోలేక తన 'దుస్థితి'నంతా కూతురికి ఉత్తరం ద్వారా తెలియపరచాలని, ఆలోచిస్తున్నారు.

ఆ సమయంలో పోష్టుమేను ఉత్తరం అందించి వెళ్ళేడు. కవరు మీద దస్తూరి చూడగానే, విజయవాడ నుంచి కూతురు రాసిందని గుర్తించి, మహదానందంతో గబగబా కవరు చింపేసి, చదవడం మొదలెట్టేరు, మంగమ్మగారు.

"అమ్మా!

చాలా రోజులకి ఉత్తరం రాస్తున్నాను గదూ? మీరంతా కులాసాగా వున్నారని తలుస్తాను.

ఈ మధ్య అనుకోకుండా రత్నం పిన్ని కనిపించింది. మొదట నమ్మలేకపోయాను....పిన్ని అవునా కాదా అని. నిజంగా ఎంత మారిపోయిం దనుకున్నావ్? గంభీరంగా, నిండుకుండలా, దర్పంగా వుండే మనిషి, ఎంతో డీలా పడిపోయి-దైన్యంగా, ఉదాసీనంగా వుందమ్మా!

గుర్నాధం బాబాయ్ వున్నంత కాలం రత్నం పిన్ని హాయిగా బ్రతికింది....కొడుకు కోడలు కూడా బాగానే చూసేవారుట! బాబాయ్ పోయాక ఆ కోడలుకి అత్తగారంటే బొత్తిగా కిట్టటం లేదుట! ఎక్కడలేని పొదుపు పిన్ని దగ్గరే చూపిస్తుందిట! అసలే కరువు రోజులు...జీతాలు చాలటం లేదు ... ఈ ముసలి 'ఘటం' ఎంతకాలం వుంటుందో.... అన్నట్టుగా చాటుమాటుగా విసుక్కుంటుందిట! తమ స్వసుఖాలకి అత్తగారు అడ్డం అని వాపోతూ వుంటుందిట! నిజానికి గుర్నాధం బాబాయ్ ప్రతి పైసా కూడగట్టి కొడుకు కోసమే దాచాడు గదా? ఆడపిల్లకి సామాన్యమైన సంబంధాలే చేసి - ఉన్న

లోకజ్ఞానం - సమాధానాలు

1. గ్రహమ్ బెల్ – ఎ. వాట్సన్‌ల మధ్య జూన్ 3,1875నాడు బెల్ తయారుచేసిన టెలిఫోన్‌లో తొలిసారిగా సంభాషణ జరిగింది. మొట్ట మొదటి టెలిఫోన్ ఎక్స్ఛేంజి అమెరికాలోని బోస్టన్ నగరంలో 1878 సంవత్సరంలో ప్రారంభించబడింది.
2. సింగపూర్‌లో అక్టోబర్ 21, 1943 నాడు రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నేతాజీ అజాద్ హింద్ ప్రభుత్వాన్ని తాను ఏర్పాటు చేసినట్లుగా ప్రకటించారు.
3. ఫిబ్రవరి 9, 1931.
4. గోపాలకృష్ణ గోఖలే. 1905 లో స్థాపించారు.
5. హెన్రీ డ్యూరాన్ట్. (Henry Durrant).
6. ఆర్వి (మహారాష్ట్ర), ఈ కేంద్రానికి కీ. శే. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పేరిట విక్రమ్ ఎర్త్ అండ్ సాటిలైట్ స్టేషన్‌గా నామకరణం చేయబడింది.
7. ఏంజెల్ ఫాల్స్ (వెనిజులా). వెనిజులాలోని కారవో నదీ శాఖవద్ద నున్న ఈ జలపాతం ఎత్తు 964 మీటర్లు, ఈ జలపాతాన్ని 1935లో అమెరికన్ పైలట్ జిమ్మీ ఏంజెల్స్ కను గొన్నాడు. అందువల్ల ఈ జలపాతాన్ని ఏంజెల్ ఫాల్స్ అని అంటున్నారు.
8. క్రిస్టోఫర్ కొలంబస్. 1492లో కనుగొన్నాడు.
9. బెల్‌గ్రేడ్, సోఫియా, టిరానా, సాన్‌జోస్, వెలింగ్టన్.
10. డబ్ల్యూ. కె. రోయిన్ట్‌జెన్ (W.k.Roentgen). జర్మన్ దేశస్థుడైన ఇతడు 1825 లో ఎక్స్‌రే విధానాన్ని కనిపెట్టాడు.

దంతా కొడుకు పేరనే రాసాడు! ఇప్పుడు ఆ కోడలు ఆ ఆస్తినంతా అనుభవిస్తూ.... పైగా ఏమంత మిగిల్చేరనీ ? ఎంత మిగిల్చేరో అంతా తినేస్తూనే వున్నారని గొణుక్కుంటూ అత్తమ్మని కన్నెత్తైనా చూడదుట! పన్నెత్తి ఆప్యాయంగా పలకరించదుట!

" ఇంకా ఏం చెప్పనూ ? నా బ్రతుకు ఇంత అధ్వాన్నమవుతుందనుకోలేదు" అంటూ పిన్ని చంటి పిల్లలా ఏడుస్తుంటే-నా మనస్సు విలవిల కొట్టుకుపోయింది ! కడుపు తరుక్కుపోయింది !

" అమ్మా ! నువ్వెంత అదృష్టవంతురాలివమ్మా? వదినలాంటి మంచి మనసున్న కోడలు ఎంత పుణ్యం చేసుకుంటే దొరకాలి ? అన్నయ్య సంపాదన చాలదనీ - సంసారం గుట్టుగా సాఫీగా సాగిపోవాలనీ తను కూడా ఉద్యోగంలో చేరింది ! అబ్బ ! ఉద్యోగం చేస్తూ ఇల్లాలిగా ఇల్లు చక్కపెట్టుకుంటూ ఎంత కష్టపడుతోందమ్మా వదిన ! సంసారాల్లో ఆర్థికచిక్కులు ఎదురవుతున్నప్పుడు ఇంట్లో కూర్చుని అత్తా కోడళ్ళు కీచులాడుకుంటు మగవాణ్ణి విసిగించి కలతలపాలు చేసే రోజులు మరిచిపోవాలి ! ఒక గడ్డు సమస్యను ఎదుర్కోవాలంటే తగిన పరిష్కారమార్గం వెతకాలి ! వదిన ఆ పనే చేస్తోంది ! ఆమె చదువు సంస్కారం ఈనాటి యువతరానికి మార్గదర్శకం అని పదేపదే తలుచుకుంటున్నాను !

" నీకు, వదినకీ, అన్నయ్యకి నా నమస్కారాలు ! పిల్లలకి నా దీవెనలు ! ఆ ! అన్నట్టు రత్నం పిన్ని నిన్ను అడిగేనని, చెప్పమన్నది ! త్వరలోనే జవాబిస్తావ్‌గదూ ?

ఇట్లు మీ కుమార్తె
పద్మ

ఉత్తరం పూర్తిచేసి అలాగే కూర్చుండిపోయారు మంగమ్మగారు. " బామ్మా ఎవరు రాసేరూ ఉత్తరం ?" సుజన అడిగేసరికి, చటుక్కున తెప్పరిల్లి " అత్తయ్య రాసిందమ్మా కాలు నొప్పిగా వుందా ? పడుకో" అంటు సుజనని చాపమీద పడుకోబెట్టింది ! మళ్ళీ అమ్మాయి రాసిన సంగతులే మనసులో మెదిలేయి !

' రత్నం చాలా అవస్థలు పడుతోందా ? ఆమె స్థితి ముందు తనదెంత మెరుగు ? కొడుకుని అపురూపంగా చూసుకుని ఏరి కోరి కోడల్ని తెచ్చుకుంది! కానీ ఈనాడు ఆ కోడలే సాధిస్తోందా ?

' కానీ మేము చేసిందేమిటీ ? ఉన్నదేదో ఊడ్చి అమ్మాయి పెళ్ళికి, పురుడు పుణ్యాలకి ఖర్చు చేసి చేతులు దులుపుకున్నాం ! అబ్బాయి ఉద్యోగం మాత్రం ఏమంత పెద్దది ? నిజానికి వాడి ఒక్కడి సంపాదనతో ఈ సంసారం సవ్యంగా నడిచేదా ? సుధ ఉద్యోగంలో చేరబట్టే గదా చింతలు లేకుండా గడిచిపోతోంది ! ఈ చంటిదాని పురుడప్పుడు కూడా సెలవు ఎక్కువ పెట్టుకోకుండా వెంటనే జాయిన్ అయిపోయింది. మామూలుగా బాలింతరాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటుందీ ? తమ కాలంలో తను పూడో నెలదాకా నీళ్ళలో పని చేసిందా ? కానీ సుధ నెలలోపునే పనిపాటలు మొదలెట్టింది. తను అప్పట్లో ఆ సంగతి అంతగా గుర్తించక-చంటిగుడ్డును తన మీద పారేసిందని విసుక్కునేది!

' పొద్దున్న పది గంటలకే వెళ్ళిపోతుందనీ పగలంతా, పిల్లలతో తను వేసారిపోతున్నాననీ తను విసుక్కుంటోందిగానీ ఉద్యోగం అన్నాక వేళకి వెళ్ళవద్దా ? మగాడితోపాటు సంపాదిస్తున్నప్పుడు మగాడిలాగే బయటికి వెళ్ళాలిగదా ? ఇన్నాళ్ళూ తను ఆ విషయం ఎందుకు ఆలోచించలేకపోయింది ?



MCA-PDP-62-Tel

'అనాది నుంచి జీర్ణించుపోయిన కొన్ని భావాలు, అంత త్వరగా సమసిపోవు! చుట్టూ వున్నవాళ్లంతా 'అత్త'ల హోదాల్లో నిర్విచారంగా తిరగగల్గుతున్నారు. మరి తను అత్తేగదా? వాళ్ళకున్న స్వేచ్ఛ తనకి లేకపోయిందే అన్న బాధ తనకి కల్గుతోంది!

'నిజానికి పెద్దరికం పేరుతో వీళ్లంతా ఆ సభలు, ఉపన్యాసాలు విని ఆచరిస్తున్నదేముందీ? ఇదివరలో విన్నవే, మళ్ళీ మళ్ళీ వింటున్నారు. ఏ మహాత్ములు సందేశమిచ్చినా, ఏ దేవతా సందర్శనం చేసుకున్నా తెల్సుకునేది ఒకటే! సర్వత్రా భగవంతుడున్నాడనీ తాపత్రయాలుమాని తృప్తితో నిస్వార్థంతో పరుల మేలును కోరుతూ ముక్తిని పొందండనీ!

'రవ్వంత వివేకాన్ని పోగొట్టుకుని అజ్ఞానంగా మూర్ఖంగా ఆలోచిస్తోందా తను? అమ్మాయి ఉత్తరం చదివేవరకు తనకు తట్టనేలేదు! ఎప్పుడూ తనవైపు నుంచే సమర్థించుకుంటోందిగానీ సుధవైపు నుంచి ఎప్పుడైనా ఆలోచించిందా?

'పిచ్చి పిల్ల! ఇల్లు వదిలి బయటికెళ్ళి – ఆఫీసులో పనితో అలిసివచ్చి ఏం దాచుకుంటోందీ? పాత బాకీలు జమకట్టడం, కొత్త అప్పులు చేసి ఇంట్లోకి కొన్ని అవసరాలు, చూడటమే సరిపోతోంది! అబ్బాయితో కలిసి సినీమాలకి షికార్లకి వెళ్ళేంత తీరుబడి కూడా లేదు! ఆస్తిపాస్తులేమీ లేవని దిగులుపడకుండా, అబ్బాయితోపాటు సంపాదించి నల్గురి సుఖం చూస్తున్న సుధ నిజంగా ఈ తరానికి మార్గదర్శే! అమ్మాయి చక్కగా రాసింది.'

'అత్తని సాధించే కోడళ్లు, కోడళ్ళని ఆరళ్లు పెట్టే అత్తలు; వున్నారంటే నవ సమాజంలో వుంటూ కూడా బూజుపట్టిన పాత బుద్ధులు వదులుకోలేకపోతున్నారన్నమాట! ఆ లెక్కలో తను కూడా అంతే! ఉహూ! వద్దు వద్దు అలా వుండకూడదు! మారుతున్న కాలంలో ఆధునిక సౌకర్యాలన్నీ అనుభవిస్తూ మళ్ళీ పాతకాలం నాటి ఛాందస భావాలు గుర్తుంచుకోకూడదు!

'ఇంకా నయం! వెర్రితనంగా నా ఊహలన్నీ అమ్మాయికి రాసి పోష్టు చేయించేను కాదు. అమ్మాయి నన్నెంతగా అసహ్యించుకునేదో? ఎంత అనర్థకం తప్పింది?'

మంగమ్మగారు ఆలోచనా స్రవంతి కొత్త పుంతల్లోకి మళ్లింది! పద్మ రాసిన ఉత్తరం ఆమెలో విజ్ఞతని తట్టిలేపింది! ఆ క్షణంలో మంగమ్మగారు ఇంతకాలంగా తన ప్రవర్తన ఎంత సంకుచితంగా వుందో తల్చుకుని సిగ్గుపడిపోయారు.

ఆ సిగ్గును దాచుకునే ప్రయత్నంలో అప్పుడే నిద్రలేచిన చంటిదాన్ని ఒడిలోకి తీసుకుని గుండెలకి హత్తుకున్నారు! మరి కాస్సేపటికి స్కూలు నుంచి ఇంటికి వచ్చిన గోపికి, నిద్రలేచిన సుజనకి అన్నాలు పెట్టేరు!

ఏ రోజు లేనిది ఆ రోజు కొడుకు, కోడలు ఇంటికి వచ్చేసరికి కాఫీ పెట్టి టిఫిను కూడా చేసేరు!

ఇంటికి వచ్చిన సుధ ఈ మార్పుకి కించిత్ ఆశ్చర్యపోయినా - ఆనందించకపోలేదు! 'అబ్బ! ఇవాళ ఎంత సుఖంగా వుందీ?' అనుకుంది. ఉత్తరం వచ్చిన సంగతే తప్ప వివరాలు చెప్పలేదు ఆవిడ! పిల్లల్ని గురించి సుధ అడగకపోయినా మంగమ్మగారే చెప్పారు! వంట చేస్తున్న సుధకి అదీ ఇదీ అందించేరు!!

'ఇవాళ అత్తగారి ధోరణి కొత్తగా వుంది సుమా?' అని పదేపదే అనుకుంది సుధ.

ఆ రాత్రి పనులన్నీ ముగించి పడుకున్న సుధ – 'పాపం! అత్తగారు ఇంట్లో పగలంతా విసుగెత్తిపోతున్నారు! నిజమే పెద్ద వయసు వచ్చాక విశ్రాంతి కావాలి! రేపు ఫష్టు మీద ఫెష్టివల్ లోను తీసుకుని ఆవిడ్ని ఏ యాత్రకైనా పంపించాలి! చంటిదాని కోసం ఓ పనిపిల్లని చూసుకుంటే - మళ్లీ అత్తగారు వచ్చేవరకు సరిపెట్టుకోవచ్చును! ఎన్నాళ్ళని ఆవిడ్ని ఇబ్బంది పెట్టనూ? రేపు కాతా కొట్లో జమ కట్టించి అత్తగారికో మంచి రగ్గు తీసుకోవాలి! ఆవిడకి కావల్సిన సదుపాయాలు శ్రద్ధగా చేయాలి! ఈ వయసులో ఆవిడ్ని సంతోషపెట్టాలి!' అనుకుంది.

ఆ రోజు సుధ తలంపులన్నీ కొత్త కొత్తగా సాగేయి! అంతేకాదు....పక్క గదిలో మంగమ్మగారు యోచనల్లో మరీ మరీ వింతలు కదిలేయి!—

సుధ ముఖం ఇవాళ ఎంత సంతోషంగా వుందీ? తనెంత దాచుకున్నా నాకు తెల్సిపోతూనే వుంది - ఆ కళ్లలో మెరుపు! పిచ్చిపిల్ల! చాలా అలసిపోతోంది! నా నుంచి గోరంత ఓదార్పు-కాస్తంత ఆదరింపు దొరికితే చాలు ...కొండెక్కినంత సంబరపడుతుంది! మళ్ళీ పండగ వస్తోంది. ఇంట్లో అన్నీ ఖర్చులే! ఈ నెలలో చిన్నదానికి జ్వరం వచ్చి మందులకి మాకులకి బాగానే వదిలింది! ఇంకేం మిగులుతుందీ? అయినా సరే సుధని ఓ మంచి చీర కొనుక్కోమంటాను! వాళ్ళిద్దరూ సినిమా కెళ్ళి ఎన్నాళ్లైందో? రేపు ఆదివారం. వాళ్ళని వెళ్ళమంటాను. పిల్ల వెధవల్ని నా దగ్గరే వుంచుకుంటాను. వాళ్ళెందుకు? పానకంలో పుడకల్లాగ!! అనుకుని, నవ్వుకున్నారు మంగమ్మగారు – దుప్పటి నిండుగా కప్పుకుంటూ! □

నంద్యాల (కిళాంబి) రాజకుమారి

శ్రీమతి నంద్యాల (కిళాంబి) రాజకుమారి భారతదేశమంతటా పలు నాట్య ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలందుకున్నారు. ఆమె తల్లిదండ్రులు శ్రీ కిళాంబి కృష్ణమాచార్య, శ్రీమతి రుక్మిణిదేవి–ఇచ్చిన ప్రోత్సాహంతో తన ఐదవ ఏటనే గజ్జెకట్టి ఇప్పటివరకు దాదాపు 250 దాకా ప్రదర్శనలు ఇచ్చారు. కీ. శే. డాక్టర్ రాధాకృష్ణన్, ప్రెసిడెంట్ నీలం సంజీవరెడ్డి వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. రాజకుమారి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ అధ్వర్యాన నిర్వహింపబడిన అఖిలభారత కూచిపూడి నాట్య పోటీలలో ప్రథమ బహుమతి పొంది 'నాట్య విశారద' బిరుదాన్ని అందుకున్నారు. నాట్యంలో కేంద్రప్రభుత్వ స్కాలర్‌షిప్ పొందిన తొలి వనిత రాజకుమారే కావడం విశేషం.

శ్రీమతి రాజకుమారి కేవలం నాట్యకారిణి మాత్రమే కాక రచయిత్రి కూడా. ఆమె రచించిన 'అశ్వఘోషుడు', 'ఆచార్య నాగార్జున', 'స్వప్నవాసవదత్త' వంటి నాటకాలు, 'జీవితమే మధురం', 'భరతనాట్య విశిష్ఠత', 'ఆశా సౌధాలు'–ఇతర కథలు, గేయాలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. శ్రీమతి రాజకుమారి భర్త శ్రీ నంద్యాల హరినాధ్ విజయవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా, సంగీత, నాటకరంగాల అభివృద్ధికి పాటుబడిన వ్యక్తిగా పేర్కొనదగినవారు.